ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 మహబూబాబాద్
బుధవారం 11 సెప్టెంబరు 2024





నిచ్చెన సహాయంతో దిగుతున్న విద్యార్థులు

బడికి పోవాలంటే నిచ్చెన దిగాల్సిందే!

ఇటీవలి భారీ వర్షాలు పెద్ద విధ్వంసాన్నే మిగిల్చాయి. అందుకు నిదర్శనమే చిన్నగూడూరు మండలంలోని ఆకేరువాగు వద్ద వరద తీవ్రతకు కొట్టుకుపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు. అధికారులు, ప్రజాప్రతినిధుల దారిని పరిశీలించి వెళ్లారు. కానీ మరమ్మతు చర్యలకు పూనుకున్న దాఖలాలు లేవు. దీంతో ఆకేరు వంతెన దాటేందుకు జనం అవస్థలు పడుతున్నారు. ఇక విద్యార్థులైతే బడికి వెళ్లేందుకు సాహసమే చేస్తున్నారు. నిచ్చెన ఎక్కి దిగుతూ అష్టకష్టాలు పడుతున్నారు. తమ ఇక్కట్లు చూసైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఉగ్గంపల్లి వంతెన వద్ద రోడ్డుకు మరమ్మతులు చేయాలని వేడుకుంటున్నారు.

- చిన్నగూడూరు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



గతేడాది భారీ వర్షాలకు జలమయమైన నగరం





వరదల్లో మునిగిన ప్రాంతాల నుంచి బాధితులను తీసుకువస్తున్న రెస్క్యూ సిబ్బంది (ఫైల్)

ఆపద వస్తే.. అంతేనా?

- ఏటా ప్రకృతి వైపరీత్యాలతో ఉమ్మడిజిల్లా అతలాకుతలం
- గోదావరి వరదలతో ఏజెన్సీలో భయం భయం
- సకాలంలో సాయం అందక గాలిలో కలుస్తున్న ప్రాణాలు, నీటి పాలవుతున్న ఆస్తులు
- వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ ఏర్పాటుకు డిమాండ్


ఏటా ప్రకృతి వైపరీత్యాలతో ఓరుగల్లు అల్లాడుతోంది. సకాలంలో సహాయక చర్యలు అందకపోతుండటంతో అనేక ప్రాణాలు గాలిలో కలిసి పోతుండగా.. రూ.కోట్ల విలువైన ఆస్తులు నీటిపాలవుతున్నాయి. విపత్తు కాలంలో అండగా నిలిచే నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) సేవలకు వరంగల్ దూరమవడమే ఇందుకు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ కేంద్రంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ ఉండగా, ప్రాంతీయ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. అయితే ఆపద వచ్చిన సమయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గోదావరి పరివాహక ప్రాంతాలకు, వరంగల్ మహానగరానికి సకాలంలో చేరుకోలేకపోతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్‌ఎఫ్) సేవలు అందిస్తుండగా, వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఎన్‌డీఆర్‌ఎఫ్ సేవలు ఎక్కడ?

ఏటా విపత్తులతో భారీగా ప్రాణనష్టం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) ఏర్పాటుకు చొరవ చూపటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ 16 బెటాలియన్లను ఏర్పాటు చేసింది. వీటిలో నాలుగింటిని 2018లో ఏర్పాటు చేయగా ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ ఏర్పాటు చేశారు. ఈ బెటాలియన్‌లో అత్యవసర పరిస్థితుల్లో పని చేయటానికి 18బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఏపీలోని కృష్ణా జిల్లాలో 12, విశాఖపట్నంలో రెండు, బెంగళూరులో రెండు, హైదరాబాద్‌లో ఒక బృందాన్ని ప్రాంతీయ ప్రతిస్పందన కేంద్రానికి (ఆర్‌ఆర్‌సీ)లో నియమించారు. తెలంగాణలో కేవలం ఒకే బృందం ఉండటంతో ఆపద సమయంలో ఢిల్లీ, విజయవాడల నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు, గోదావరితీర ప్రాంతానికి రప్పించుకోవాల్సి వస్తుంది. వీటి అనుమతులకు గంటల సమయం పడుతుండటంతో ఆపదలో పూర్తిగా సాయం అందటం లేదు. ప్రతిఏటా ఎక్కడో ఒకచోట విపత్తులు ఎదురవుతున్నాయి. ఏజెన్సీలో అమాయక రైతులు వాగులు, వరదల్లో చిక్కుకపోయి అవస్థలు పడుతుండగా, కొందరు మృత్యువాత పడుతున్నారు. భూపాలపల్లి సింగరేణి రెస్క్యూ టీమ్‌ను అపద సమయంలో అత్యవసరంగా వాడుకునే వారు. అయితే సింగరేణి కాకుండా ఇతర చోట్ల జరిగే ప్రమాదాల్లోకి రెస్క్యూ టీమ్ వెళ్లకుండా కొంతవరకు అంక్షలు అమలు చేస్తున్నారు. దీంతో సింగరేణి రెస్క్యూ టీమ్ సేవలు అరుదుగా మారాయి. ఇక వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో డీఆర్‌ఎఫ్ టీమ్‌ను స్థానికంగా ఏర్పాటు చేసి, వరదల సమయంలో నగరవాసులకు సాధ్యమైనంత వరకు సేవలు అందిస్తున్నా.. ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు ఉన్న సామర్థ్యం ఆ బృందాలకు ఉండే అవకాశం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్ ఏర్పాటు చేస్తేనే ప్రజల ప్రాణాలకు రక్షణ లభిస్తుందనే చర్చ జరుగుతోంది.



ఈనెల 1న మహబూబాబాద్ శివారు రాళ్లవాగులో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న హైదరాబాద్ రెస్క్యూ బృందం



భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక శివారు మోరంచ బ్రిడ్జి పనులు చేస్తూ వరదలో చిక్కుకుపోయిన ఆరుగురు కూలీలను కాపాడడానికి వచ్చిన ఎన్డీఆర్‌ఎఫ్ హెలికాప్టర్లు (ఫైల్)

ప్రతీ ఏడాది విపత్తులతో విలవిల..

గోదావరితీరంలో ప్రతీ ఏటా వచ్చే విపత్తులతో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు అతాలకుతలం అవుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా క్లౌడ్ బరస్ట్‌లు, టోర్న డోలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఏర్పడు తున్నాయి. వాతావరణ మార్పులతో ప్రకృతి కన్నెర్ర చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. 2020 ఆగస్టు 15న భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కుందనపల్లి సమీపలంలోని చలివాగులో 12మంది రైతులు చిక్కుకు పోయారు. వాగులో చిక్కుకున్న రైతులను 8గంటల అనంతరం ఎన్డీఆర్‌ఎఫ్‌కు చెందిన రెండు హెలికాప్టర్ల సాయంతో ఆ రైతులను బయటకు తీసుకొచ్చారు. 2023 జూలై 27వ తేదీన భారీ వర్షాలకు భూపాలపల్లి, ములుగు జిల్లాలో 20మందికి పైగా వరదలో గల్లంతయి మృత్యువాత పడ్డారు. ముఖ్యంగా మోచంవాగు ఉధృతంగా ప్రవహించడంతో భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నైన్‌పాక శివారు మోరంచపై బ్రిడ్జి పనులు చేస్తున్న అస్సాం, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు కూలీలు వరదలో చిక్కుకున్నారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం

మిగతా 7వ పేజీలో..



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

చాకలి ఐలమ్మకు నివాళి

- ఆమె పోరాటాన్ని కీర్తించిన వక్తలు
- మానుకోటలో నివాళులర్పించిన కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

వివరాలు 8లో..

16న నిజాం చెరువులో వినాయక నిమజ్జనం

- మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 10 : జిల్లా కేంద్రంలోని నిజాం చెరువులో ఈనెల 16న వినాయక నిమజ్జనం జరిపేందుకు మునిసిపల్ పాలకవర్గం నిర్ణయించినట్లు కమిషనర్ నోముల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రులు పూజలందుకున్నగణనాథుల విగ్రహాల నిమజ్జనం నిజాం చెరువులో చేసేలా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భక్తులు, గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు గమనించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వరుస క్రమంలో వచ్చి, నిజాంచెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

మహబూబాబాద్‌టౌన్, సెప్టెంబరు10 : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి 17 వరకు జరుపతలపెట్టిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గ్రామాలలో సాయుధ పోరాట అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో 17న జాతీయ జెండాలు ఎగురవేయాలని సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తీవ్రనష్టం వాటిల్లిందని, దీనిని కేంద్రప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి తెలంగాణ రాష్ట్రానికి రూ.10 వేలకోట్ల సాయం అందించాలని డిమాండ్ చేశారు. సదరు డిమాండ్‌తో ఈనెల 12న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా నాస్ పరీక్ష

- విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు నిర్వహణ
- హాజరైన 11,457 మంది

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు10 : జిల్లాలోని అన్నిప్రభుత్వ పాఠశాలల 3, 6, 9వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్ (నాస్) పరీక్ష మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి రాజేశ్వర్, మండల విద్యాధికారులు, జిల్లా సెక్టోరియల్ అధికారులు, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సందర్శించి, ఎగ్జామ్ నిర్వహణ తీరును పరిశీలించారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు మొత్తం 921 ఉండగా.. వాటిల్లో 1వ తరగతి నుంచి 9 వరకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో 60,438 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 3వ తరగతి పరీక్షకు జిల్లా వ్యాప్తంగా ఇంగ్లీష్ మీడియంలో బాలురు-1,931, బాలికలు-1,892, తెలుగు మీడియంలో బాలురు-178, బాలికలు-213, ఉర్దుమీడియంలో బాలికలు-1 మాత్రమే హాజరయ్యారు. 6వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో బాలురు- 1,205, బాలికలు-1,257, తెలుగు మీడియంలో బాలురు- 138, బాలికలు-137, ఉర్దు మీడియంలో బాలికలు-1 మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 9వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో బాలురు- 2,063, బాలికలు-1,632, తెలుగు మీడియంలో బాలురు-244 బాలికలు-542, ఉర్దూ మీడియంలో బాలురు-2, బాలికలు-6 గురు హాజరయ్యారు. 3,6,9 తరగతుల్లో పరీక్షకు హాజరైన బాలురు- 5, 764, పరీక్షకు హాజరైన బాలికలు-5693 మొత్తం- 11,457 మంది పరీక్ష రాశారు.

సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలి

మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 10 : ఇటీవల కురిసిన వర్షాలతో ఏర్పడ్డ సమస్యలను గుర్తించి, పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వర్షాలతో జరిగిన నష్టాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మునిసిపాలిటీ పరిధిలో కురిసిన భారీ వర్షాలతో తీవ్రనష్టం వాటిల్లిందని చెప్పారు. పలువార్డుల్లో శిథిలాల తొలగింపు, వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించడం, డ్రైనేజీల్లో మట్టి తీసి, వరదకాల్వలు, మురుగుకాల్వలు, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు సమస్యలను గుర్తించి పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్, అధికారులు శ్రీధర్, సాయిరాం పాల్గొన్నారు.

చెరువులు ఖాళీ

భారీ వర్షాలకు జిల్లాలో తెగిన 127కట్టలు

- వరదలతో పొలాల్లో ఇసుక మేటలు
- నష్టపోయిన రైతులు
- అంచనాకు నేడు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



మహబూబాబాద్ మండలం వీఎస్ లక్ష్మీపురం పెద్దకుంట చెరువు గండి పడ్డ దృశ్యం

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 10 : పది రోజుల క్రితం కురిసిన భారీవర్షాలు తీవ్రనష్టాన్ని మిగిల్చినాయి. జిల్లాను అన్నిరకాలుగా అతలాకుతలం చేశాయి. వర్షం, వరదల బీభత్సానికి కోలుకోకుండా చేశాయి. మహబూబాబాద్ జిల్లాలో 127 చెరువులు కట్టలు తెగిపోగా, మరికొన్నింటికి గండ్లుపడ్డాయి. దీంతో చెరువులు, కుంటల్లో నీరు బయటకు వెళ్లిపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఎడారులను తలపిస్తున్నాయి. చెరువుల కింద ఉన్న పంటపొలాలు అనేకంగా కొట్టుకుపోగా, కొన్ని నీటమునిగాయి. మరికొన్నింటిలో ఇసుకమేటలు వేశాయి. లక్షలాది రూపాయలను రైతులు నష్టపోవడంతో వారు విలవిలలాడారు. ఈ ఖరీఫ్‌తో పాటు వచ్చే యాసంగి కూడా కష్టమేనంటూ రైతులు వాపోతున్నారు. కాగా, జిల్లాలో జరిగిన పంటనష్టంపై అంచనాలు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఢిల్లీ నుంచి కేంద్రకమిటీ బృందం బుధవారం జిల్లాకు చేరుకుని ప్రత్యక్షంగా పంటలు, తెగిన రోడ్లు, చెరువులు, వాగులను పరిశీలించనున్నారు.

తెగిన చెరువుల వివరాలు ఇలా..

జిల్లాలో 1,590 చెరువులు ఉండగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 127 చెరువుల కట్టల తెగిపోయాయి. ఇందులో 71 చెరువుల కట్టలు పూర్తిగా తెగిపోగా, 56 చెరువులకు గండ్లు పడ్డాయి. ఇంకా జిల్లాలో 42 చెక్‌డ్యాంలు ఉండగా అందులో ఆరు తెగిపోయాయని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. మహబూ బాబాద్ జిల్లాలో వాగుల ఉధృతి ఇంకా తగ్గకపోవడంతో మిగతా చెక్‌డ్యాంల పరిస్థితి ఎలా ఉందో తెలియడం లేదు. వరదలు తగ్గితే కానీ చెక్‌డ్యాంల పరిస్థితిని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేయడానికి సిద్దంగా ఉన్నారు.

శాశ్వత మరమ్మతులకు రూ.23 కోట్లు..

జిల్లాలో తెగిన చెరువులు, కుంటల శాశ్వత మరమ్మతుల కోసం రూ.23 కోట్లు అవసరమని జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. శాశ్వత మరమ్మతుల కోసం రూ.4.37కోట్లు ఈరోజు వరకు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. చెరువుల మరమ్మతుల కోసం టెండర్లు పిలవడానికి అధికారులు ఎస్టిమెట్‌లు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. తెగిపోయిన చెరువుల్లో నీరు వృథాగా బయటకు వెళ్లకుండ నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. పలు చెరువులు, కుంటల మరమ్మతుల పనులను ప్రారంభించారు. మంగళవారం కంబాలపల్లి పెద్ద చెరువులో మత్తడి వద్ద కట్ట ప్రమాదకరపరిస్థితిలో ఉందని తెలుసుకున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో అధికారులు ఆ కట్టకు జేసీబీ సాయంతో పకడ్బందీ పనులు చేపట్టారు. జిల్లాలో మరికొన్ని కుంటలు, చెరువుల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి.



ఇనుగుర్తి శివారు కమ్మరికుంటకు గండి పడ్డ దృశ్యం

నేడు ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం రాక..

అకాల భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఢిల్లీ నుంచి ఒక ప్రత్యేక బృందం జిల్లాలో పర్యటించనుంది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆథారిటీ సలహాదారు, కేంద్రహోంశాఖ జాయింట్ కార్యదర్శి కల్నల్ కీర్తిప్రతాప్‌సింగ్ నేతృత్వంలో కూడిన కేంద్ర బృందంతో పాటు హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఇంజనీరింగ్ చీఫ్ నాగేందర్ (ఆపరేషన్ మెయింటెనెన్స్)తో పాటు రాష్ట్ర ఇతర అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం ఈ పంటనష్టం వేసే బృందంతో ఉంటారని తెలుస్తోంది. ముందుగా ఖమ్మం వెళ్లి ఖమ్మం నుంచి ముల్కలపల్లి, మరిపెడ, పురుషోత్తమయగూడెం తండాల్లోను ఈ కేంద్ర బృందం పర్యటించనుంది. మరిపెడలో వరదకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, అక్కడ్నుంచి సూర్యాపేటకు తరలివెళ్తారని తెలుస్తోంది. సాయంత్రం 6 గంటల వరకు కేంద్రప్రభుత్వ పర్యటన వివరాలు షెడ్యూల్‌ను జిల్లా అధికారులు ప్రకటించలేదు.

చెరువులు, వాగుల కింద ఇలా...

జిల్లాలో అనేక చెరువులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో వరి పొలాలు కొట్టుకుపోగా, మరికొంత నీటమునగగా, మరికొన్నింట్లో ఇసుక మేటలు వేసారు. పొలాల్లో వేసిన ఇసుక మేటలు జేసీబీ యంత్రాలతో తొలగించాల్సిన పరిస్థితి ఉంది. ఆ ఇసుక మేటలు తొలగించాలంటే రైతులు ఆర్థికంగా భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. డబ్బులు లేక రైతులు ఏం చేయాలో తోచక తలల పట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. పొలాల్లో పేరుకుపోయిన ఇసుక మేటలు తొలగించి మళ్లీ పొలంగా మార్చాలంటే చాలా సమయం కూడ పడుతుంది. ఈ ఖరీఫ్‌లోనే రైతులు నష్టపోతుండగా వచ్చే యాసంగిలో వ్యవసాయం సాగుతుందా.. లేదా అనేది ప్రశ్నార్థకంగా మిగిలిపోతోంది. చెరువుల్లో నీరు వృథాగా వెళ్లిపోవడంతో ఖాళీగా ఉన్న చెరువులు చూసి రైతులు బోరుమంటుండగా మరికొంత మంది రైతులు ఉన్న పొలాలకు నీరు లేదని, పంటలు ఎలా పండుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ ఖరీఫ్‌లో భారీ వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నది వాస్తవం.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

మడికొండ, సెప్టెంబరు 10 : కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మృతి చెందాడు. మడికొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చెరువు కట్ట కాలనీకి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి రాయికంటి మొగిలి(64) కుంటుబ అవసరాల కోసం లోన్ ద్వారా అప్పు తీసుకున్నాడు. డబ్బులను కొంత మందికి అప్పుగా ఇస్తూ ఖర్చు చేస్తుండగా పిల్లల చదువుల కోసం తీసుకున్న డబ్బులు ఇతరులకు ఇస్తూ ఇలా ఖర్చు చేస్తే ఎలా అని భార్యా భర్తలమధ్య గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి లోనైన మొగిలి.. మంగళవారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య, కుమారులు వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ ఐటీఐ ప్రిన్సిపాల్ మృతి

కాజీపేట, సెప్టెంబరు 10: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన వరంగల్ ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్, ముదిరాజ్ సంఘం నేత దండబోయిన సారయ్య(67) ముదిరాజ్ అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంచిర్యాల, సుల్తానాబాద్, వరంగల్, ప్రభుత్వ ఐటీఐలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. భౌతికకాయాన్ని ప్రశాంత్‌నగర్‌లోని వారి నివాసంలో మంగళవారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్, జిల్లా నాయకులు పెండ్యాల సారంగపాణి, డి. లక్ష్మీనారాయణ తదితరులు దర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి సంఘం కోసం ఆయన చేసిన సేవలు కొనియాడారు. సారయ్య అంత్యక్రియలు బుధవారం హనుమకొండ పద్మాక్షిశ్మశాన వాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుట్కా పట్టివేత

వరంగల్ క్రైం, సెప్టెంబరు 10: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.15వేల విలువ కలిగిన గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. స్టేషన్ పరిధిలోని జయ బాలాజీ కిరాణం షాపు యజమాని హరితేజ వద్ద రూ.10,250, సిగరెట్ సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న కృష్ణ వద్ద రూ.5వేల విలువకలిగిన గుట్కాను పట్టుకున్నారు. ఇద్దరిని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ ధ్రువీకరించారు.

చెన్నై సదస్సులో ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: సెప్టెంబరు 2 నుంచి 7 వరకు చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 18వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ థర్మల్ ఎనిలిసిస్ అండ్ కాలోరిమెట్రీ 2024 సదస్సుకు కేయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న హాజరయ్యారు. థర్మోడినమిక్ అండ్ డీఎఫ్‌టీ స్టడీస్ బిట్‌విన్ 1, 2 ఇథియలిడిమిక్ అండ్ 1,5 పెంటనిడిల్ ఎట్ టీ293.15 టూ 313.15కే అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి సైంటిస్టులు పాల్గొన్న ఈ సదస్సులో సవితాజ్యోత్స్న టెక్నికల్ సెషన్‌కు అధ్యక్షులుగానూ వ్యవహరించారు.

రేపు గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

మడికొండ, సెప్టెంబరు 10: వరంగల్ రీజియన్ హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 12న మడికొండ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు డీసీవో దాసరి ఉమామహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల కులము, ఆదాయం, నివాసం, ఆధార్, స్టడీ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు నేరుగా మడికొండ గురుకుల పాఠశాలకు రావాలని తెలిపారు. ఎంట్రెన్స్ రాసిన హాల్‌టికెట్ వెంట తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 99498 92426, 76809 06134 నంబర్లలో సంప్రదించాలని డీసీవో కోరారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10: ఇంటర్‌లో ఫస్టియర్‌లో ప్రవేశాల గడువును పొడిగించినట్లు వరంగల్, హనుమకొండ డీఐఈవోలు ఎ.గోపాల్, డాక్టర్ జి.సుమన్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డు నిర్దేశించిన ప్రవేశాల గడువు ఈ నెల 7తో ముగియగా ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఈ నెల 15 వరకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు బోర్డు అధికార వర్గాలు ఆదేశాలు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికీ ఇంకా ప్రవేశాలు పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్సు దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్‌లోని శివసాయి కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళను, ఓ విటుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వేలేరు మండలానికి చెందిన ఓ మహిళ శివసాయి కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఇతర రాష్ట్రాలనుంచి మహిళలను తీసుకువచ్చి ఏడాదిగా వ్యభిచార దందా నిర్వహిస్తోంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. కేయూ పోలీసులతో కలిసి మంగళవారం ఆ గృహంపై దాడి చేసి మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ విటుడిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకురాలిని అరెస్టు చేసి విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధ్రువీకరించారు.

కేయూ భూములపై అధికారుల విచారణ

● జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీగా ఏర్పడి సమగ్ర సర్వేలు ● నివేదిక అందజేయనున్న అధికారులు



వర్సిటీలో విచారణ చేస్తున్న విజిలెన్స్, ఇన్స్‌పోర్స్‌మెంట్ అధికారులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ భూకబ్జాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు రెవెన్యూ, సర్వే, మునిసిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వర్సిటీ భూములను అందినకాడికి అందినట్లు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టిన బడావ్యక్తుల కబ్జాల బాగోతాలను ఆధారాలతో సహా బయటపెట్టేందుకు సమగ్ర సర్వే చేపట్టారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీలోని కబ్జాలకు గురైన భూములను అధికారులు జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీగా ఏర్పడి సమగ్ర సర్వేలు చేపట్టారు. రెండు రోజుల విచారణలో భాగంగా తొలిరోజు మంగళవారం వర్సిటీ న్యూ పీజీ హాస్టల్ పక్కన బీసీ కాలనీలోని 229 సర్వే నెంబర్‌లో సర్వే చేపట్టారు. మునిసిపల్ అధికారులు బీసీ కాలనీల్లోని పలువురికి భూ అక్రమణలపై నోటీసులు జారీ చేయడంతో వారు అధికారుల ఎదుట హాజరై తమ వాదనలు వినిపించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ రాకేశ్ నేతృత్వంలో వర్సిటీ భూముల పాత సర్వే రిపోర్టులు, వర్సిటీ డెవలప్‌మెంట్ అధికారుల వద్ద ఉన్న దస్తావేజులను పరిశీలించారు. వర్సిటీది మొత్తం ఎంత భూమి వుంది..? ఏ సర్వే నెంబర్‌లో ఉండేదని గుర్తించారు. అక్రమణలు ఎక్కడెక్కడ జరిగాయనే విషయంలో అధికారులు సమగ్రంగా పరిశీలన చేపట్టారు. వర్సిటీల్లో భూముల్లో నిర్మించిన అక్రమ భవనాలు, ఇతర కట్టడాలను గుర్తించారు. వర్సిటీలోని ఇంచు భూమి కూడా అక్రమణకు గురికావొద్దని విద్యార్థి సంఘాల నేతలు వర్సిటీలోకి వచ్చిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను కలిసి వినతి పత్రాలను అందచేశారు.

నేడు అధికారుల నివేదికలు

కాకతీయ యూనివర్సిటీలోని భూ కబ్జాల పర్వాలపై మంగళవారం మొదటి రోజు విచారణ చేపట్టిన అధికారులు.. రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి నివేదిక రూపొందించనుంది. బుధవారం రెండో రోజు కూడా వర్సిటీలో భూ కబ్జాలపై విచారణ చేస్తారు. అనంతరం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ, సర్వే అధికారులు కబ్జాలపై సమగ్ర నివేదికను రూపొందించి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ డెవలప్‌మెంట్ అధికారి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డిలకు అందచేస్తారు. విచారణ అధికారుల నివేదిక ఆధారంగా వర్సిటీలో ప్రహరీ నిర్మాణం తొందరగా చేపట్టే అవకాశం ఉంది.

వర్సిటీ భూములను మింగేసే కుట్ర

కాకతీయ యూనివర్సిటీ భూములను మింగేసే కుట్రలో భాగంగానే వర్సిటీలో కబ్జాలపై ఉన్న భూముల రిపోర్టులను పక్కన పెట్టి మళ్లీ సర్వేల పేరుతో కుట్రలు పన్నారనే ఆరోపణలు వర్సిటీలో వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ భూముల కబ్జాల భాగోతాలపై గతంలో కలెక్టరేట్ ఉన్నతాధికారులు అధికారులు, వర్సిటీ పాలక మండలి సభ్యుల సమగ్రంగా వర్సిటీ భూముల దస్తావేజులను రెవెన్యూ సర్వేలు, రిపోర్టులను చూసి కబ్జాల పర్వాలపై సమగ్రమైన నివేదికలను అందచేశాయి. వర్సిటీ భూములు కబ్జాలకు గురయ్యాయనే విషయం అప్పట్లోనే అయా అధికారుల నివేదికలతో స్పష్టమైంది. అయితే అప్పటి వర్సిటీ మాజీ వీసీతోపాటు వర్సిటీలో పలుకుబడి కలిగిన అధికారులు అయా రిపోర్టులను కనీసం బయటికి తీయలేదు. కబ్జాలపై ఉన్నటువంటి సమగ్ర రిపోర్టులను అమలు చేయకుండా మళ్లీప్పుడు తాజాగా రెవెన్యూ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, మునిసిపల్ అధికారులందరితో సర్వేలు చేపట్టారు. ఈ సర్వేలపై పేరుతో వర్సిటీ భూములపై అటలాడుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి గతంలోనే వర్సిటీ అధికారులు రూ.10కోట్లు కేటాయించారు. పనులను మధ్యలో అపేసి భూముల విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని వర్సిటీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. భూములపై డబుల్ సర్వేలు చేపట్టి ఎవరిని కాపాడుతున్నారని విద్యార్థి సంఘాల నేతలు అధికారులు ప్రశ్నిస్తున్నారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10: వరంగల్ జిల్లా ఉపాధి కల్పన, శిక్షణశాఖ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్. ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో వర్చువల్ కేర్ విభాగంలో 50 ఖాళీలకు, ఎస్ బ్యాంక్‌లోని సీనియర్ ఆఫీసర్లు 20 ఖాళీలకు, ముత్తూట్ ఫైనాన్స్ హైదరాబాద్, వరంగల్‌లోని బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్స్ 20ఖాళీలకు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్స్ 30 ఖాళీలకు, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్స్ 20ఖాళీలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ పాసైన 22 నుంచి 35 ఏళ్లలోపుగల అభ్యర్థులు వారి సర్టిఫికెట్లతో ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆమె కోరారు.

13న మినీ జాబ్ మేళా

హనుమకొండ జిల్లా ఎంప్లాయింట్ అండ్ ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వే టూ న్యూస్ వరంగల్, హనుమకొండలో సేల్స్ ట్రెయినీలు 15 ఖాళీలు, భారత్ ఫైనాన్సియల్ ఇన్లూషన్‌లో లోన్ ఆఫీసర్లు 40 ఖాళీలు, ఆదర్శ మారుతీ సుజుకీ ములుగురోడ్‌లోని షోరూమ్‌లో టెలీకాలర్లు, డ్రైవర్లు 5 ఖాళీలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు డిగ్రీ, ఎంబీఏ, ఇంటర్, ఐటీఐలో ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్ల వయస్సుగల వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు శుక్రవారం ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిర్వహించే జాబ్ మేళాలలో వారి సర్టిఫికెట్లతో ఉదయం 11గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

కేయూ దూరవిద్య పరీక్షల రీ షెడ్యూల్ వెల్లడి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న బీఎల్ఐఎస్సీ, ఎంఎస్‌బ్ల్యూతో పాటు ఇతర పరీక్షల రీ షెడ్యూల్‌ను మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ మంగళవారం తెలిపారు. మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్(ఎంఎస్‌డబ్ల్యూ), ఫైనల్ ఇయర్‌వైజ్, నాలుగో సెమిస్టర్ పరీక్షలు సెప్టెంబరు 90న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, అలాగే బీఎల్ఐఎస్సీ ఎక్స్ అభ్యర్థులకు 18 సెప్టెంబరు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సోషల్ వర్క్స్ అభ్యర్థులకు కేయూక్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాల, బీఎల్ఐఎస్సీ అభ్యర్థులకు కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

అన్నం వండలేదని తమ్ముడిపై దాడి

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 10 : అన్నం ఎందుకు వండలేదంటూ తోడబుట్టిన తమ్ముడిపై అన్న కత్తితో దాడికి పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలోని రాంనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రాంనగర్‌కు చెందిన దుర్గం ధర్మి-శోభ దంపతులకు ఇద్దరు కుమారులు అమర్, దేవేందర్ ఉన్నారు. ధర్మి, శోభలు దంపతులు గతంలోనే మృతిచెందారు. అన్నదమ్ములు అవివాహితులు కాగా, ఓ అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అమర్ మటన్ షాపులో గుమస్తాగా పనిచేస్తుండగా, దేవేందర్ భవన నిర్మాణ కార్మికుడిగా అప్పుడప్పుడు వెళ్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం అమర్ పనిచేసే షాపు వద్దకు మద్యం మత్తులో ఉన్న దేవేందర్ వెళ్లి ఇంట్లో అన్నం ఎందుకు వండలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మాటామాటా పెరిగింది. అదే సమయంలో దేవేందర్ పక్కనే ఉన్న కత్తిని తీసుకొని దాడి చేయగా అమర్‌కు కడుపులో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్సల కోసం ఎంజీఎంకు వైద్యులు రెఫర్ చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.



అమర్‌కు నర్సంపేట ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యులు

కళలను మరింత ఆదరించాలి

మయూరి నాట్య కళా వేడుకల్లో వేదాంతం రాధేశ్యామ్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 10: విశ్వ జనీనమైన కళలను ఆదరిస్తూ కళాకారులను మరింతగా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని ప్రఖ్యాత నాట్యాచార్యుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కూచిపూడి అగ్రహారానికి చెందిన డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నేత్రపర్వంగా జరిగిన మయూరి నాట్యకళా కేంద్ర 17వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ నటుడు, కళాకారుడు, రిటైర్డ్ విద్యాశాఖాధికారి బూర విద్యాసాగర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాధేశ్యామ్ మాట్లాడుతూ.. కూచిపూడి నృత్యం విశ్వవ్యాపితమైందన్నారు. కళలకు భాషా, ప్రాంతీయ భేదాలుండవని చెబుతూ అన్ని మెళకువలను నేర్చుకొని నృత్య రంగంలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. కళలకు కాణాచి అయిన ఓరుగల్లులో దశాబ్దంన్నర కాలంగా వందలాది చిన్నారును నాట్యరంగంలో తీర్చిదిద్దుతున్న కుండె అరుణరాజ్‌కుమార్‌ను ఆయన ప్రశంసించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు చదువుతో పాటు ఇతర కళారంగంలోనూ ప్రొత్సహించాలన్నారు. బూర విద్యాసాగర్‌గౌడ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ కళాకారులుగా రాణిస్తూ భవిష్యత్ కళాకారులను తయారు చేసేందుకు కృషి చేయాలన్నారు. వందలాది మంది నాట్య కళాకారులను తయారు చేస్తున్న అరుణ అభినందనీయురాలన్నారు.



మాట్లాడుతున్న కూచిపూడి నాట్యాచార్యులు రాధేశ్యామ్

ఈ వేడుకల్లో దేవాదాయ శాఖ సహాయ సంచాలకురాలు రాయల సునిత, చక్రవర్తి హాస్పిటల్స్ డాక్టర్ తరుణ్, సంగీత కళాకారుల సంఘం అధ్యక్షుడు సీతాల రఘువేందర్, కిట్స్ సూపరింటెండెంట్ పొట్లపల్లి ప్రసాదరావు, మేకల రమేష్, రోజా క్రియేషన్స్ ఆలేటి శ్యాంసుందర్, పెండెం వేణుమాధవరావు, టి. నరేందర్, పెరుమాండ్ల వెంకట్, తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. మయూరి నాట్య కళాక్షేత్రం నిర్వాహకులు కుండె అరుణరాజ్‌కుమార్ స్వాగతం పలికారు. తొలుత ఈ వేడుకలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నా తల్లే నా దైవం శీర్షికన ప్రారంభమైన వేడుకల పరంపరలో కుండె కొమురమ్మను ఎమ్మెల్యే రేవూరి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం విద్యార్థినులు శ్రీకృష్ణ రమణీయం, శివతాండవం లాస్యం లాంటి అనేక నృత్య రూపకాలు, నృత్యాలు ప్రేక్షకులకు కనువిందు చేశాయి.

పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

హైకోర్టు తీర్పుపై న్యాయనిపుణులతో చర్చిస్తాం..

అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తాం..

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 10: పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు, ఆ పార్టీ నేతలకు లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రతిపక్షపార్టీల శాసనసభాపక్షాలను విలీనం చేసుకున్న నీచచరిత్ర బీఆర్ఎస్‌ది అని మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు వివిధ రాజకీయ పార్టీల నుంచి 32 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని ఏ ఒక్కరు వారిలో డిస్ క్వాలిఫై కాలేదన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు సైతం ఇచ్చారని, రాజీనామాలు చేయకుండానే తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి మంత్రులయ్యారని గుర్తు చేశారు. పెద్ద ఎత్తున పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్ఎస్ పార్టీ సిగ్గులేకుండా మాట్లాడుతుందన్నారు. హైకోర్టు తీర్పుతో లొట్టపెట్ట పెదవులకు నక్క ఆశపడ్డట్లుగా కొందరు ఉప ఎన్నికలు వస్తాయని మాట్లాడుతున్నారని వారి అజ్ఞానానికి జాలిపడుతున్నానని తెలిపారు. ఎవరు ఎన్ని ఆశలు పెట్టుకున్నా ఉప ఎన్నికలు రావని తేల్చి చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పు ఇచ్చిందని అయితే తీర్పుకు సంబంధించిన ఒరిజినల్ కాపీ తమకు అందలేదని కేవలం పత్రికల్లో చూశామని తెలిపారు. తీర్పుకు సంబంధించిన ఒరిజినల్ కాపీ అందిన తరువాత విషయమై పార్టీ పెద్దలతో, న్యాయ నిపుణులతో చర్చించిన తరువాత భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయింపులపై గతంలో, ప్రస్తుతం హైకోర్టు, సుప్రీంకోర్టులు రెండు భిన్నమైన తీర్పులు ఇస్తున్నాయన్నారు. కోర్టులను గౌరవించే బాధ్యత తమకుందన్నారు. డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతామన్నారు. ఏమో అయినట్లు ఎన్నికలు వచ్చినట్లు కొందరు బీఆర్ఎస్ నాయకులు ఆశపడతున్నారని ఎద్దేవా చేశారు. కొందరు పగటి కలలు కనడం వారి అజ్ఞానికి, దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకంతో గెలిపించారని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు విమర్శకుల నోళ్లు మూయించేలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్టీ రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, మంతెన ఇంద్రసేనా రెడ్డి, నాయకులు అంబటి కిషన్‌రాజు, జీడి రమేష్, బూర్ల శంకర్, కోతి రాములు, రజాక్‌యాదవ్, కొంతం శ్రీనివాస్, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ కమిటీల్లో మానుకోటకు ప్రాధాన్యం

ఎస్టిమేట్స్, పబ్లిక్ అకౌంట్స్ సభ్యులుగా ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలకు అవకాశం



ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

మహబూబాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అంచనాల కమిటీ, తెలంగాణ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ)ల్లో మహబూబాబాద్ జిల్లాకు ప్రాధాన్యత దక్కింది. ఆయా కమిటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం దక్కింది. ఆయా కమిటీల్లో సభ్యులుగా జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినిరెడ్డి, కోరం కనకయ్యకు చోటు లభించింది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులతో పబ్లిక్ అకౌంట్స్, ఎస్టిమేట్స్, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలను ఏర్పాటు చేస్తూ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో కమిటీలో చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులు ఉంటారు. ఇందులో తెలంగాణ ఎస్టిమేట్స్ (అంచనాల) కమిటీ సభ్యులుగా జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో పాటు జిల్లాలోని తొర్రూరు పెద్దవంగర ప్రాతినిధ్య మండలాల పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, బయ్యారం, గార్ల మండలాల ప్రాతినిధ్య ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌కు అవకాశం దక్కింది. మహబూబాబాద్ జిల్లా నుంచి అత్యధికంగా నలుగురు ప్రజాప్రతినిధులకు అవకాశం లభించడం విశేషం.

ఎంజీఎం ఉద్యోగిపై దాడి ఘటనలో మహిళ అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, సెప్టెంబరు 10: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సుమలతపై ఇనుప గొలుసుతో దాడి చేసి గాయపరిచి డబ్బులను బలవంతంగా లాక్కున్న రాజమ్మను మంగళవారం అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ సీఐ తుమ్మ గోపి తెలిపారు. ఏసీపీ నందిరాం నాయక్ కథనం ప్రకారం.. బిల్ల సుమలత 15 ఏళ్ల నుంచి ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తోంది. రెండేళ్ల నుంచి పేషెంట్ కేర్ విభాగంలో పని చేస్తోంది. ఈనెల 9న విధుల్లో భాగంగా ఎంజీఎం బయోమెట్రిక్ మిషన్ వద్ద సుమలత వేలిముద్ర వేస్తుండగా ఆలకుంట రాజమ్మ అడ్డుకొని రూ.2 లక్షలు ఇవ్వాలని, లేదంటే చంపేస్తానని బెదిరించింది. ఆపై ఇనుప గొలుసుతో సుమలతపై దాడి చేసి గాయపరిచింది. తర్వాత ఆమె చేతిలో ఉన్న సెల్‌ఫోన్ తీసుకొని పగలగొట్టి, ఆమె వద్ద ఉన్న రూ.10వేలు లాక్కొని అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మంగళవారం రాజమ్మను అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి రూ.వేయి నగదు, ఇనుప గొలుసును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 10: ఎంజీఎం ఆస్పత్రిలో సుమలత అనే ఉద్యోగిపై జరిగిన ఘటనకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుమలతపై దాడిచేసిన రాజమ్మ అనే మహిళ.. గతంలో ఎంజీఎంలో విధులు నిర్వహించినప్పటికీ తనపై ఉన్న అభియోగాలవల్ల విధుల నుంచి తొలగించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలను ఉపేక్షించేది లేదని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో మళ్లీ వైద్యుల పట్ల కానీ, వైద్య సిబ్బంది పట్ల కానీ ఇలాంటి ఘటనలకు పాల్పడితే రౌడీషీట్ నమోదు చేయాలని సంబంధిత అధికారును ఆదేశించారు.

చెరువులలో గుర్రపుడెక్కను తొలగించాలి



అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 10: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9 చెరువులలో గుర్రపుడెక్కల ఆకులు నిండి ఉన్నాయని, గణపతి నిమజ్జనానికి గుర్రపుడెక్కల ఆకులతో అసౌకర్యంగా ఉంటుందని చిన్నవడ్డెపల్లి చెరువు ఆక్రమణ ఏరియా పరిరక్షణ సొసైటీ సభ్యులు తెలిపారు. మంగళవారం బల్దియా అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. గణేశ్ నిమజ్జనం చేసే చెరువులలో గుర్రపుడెక్క ఏపుగా పెరిగి మురిగిపోవడంవల్ల దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ప్రధానంగా దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువు, మట్టెవాడ కోట చెరువు, ఉర్సు రంగసముద్రం, భద్రకాళి చెరువు, బెస్తం చెరువు, రంగశాయిపేట దామెర చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, ఖిలావరంగల్ మాల అగర్తల చెరువు, కాజీపేట బంధం చెరువులలో చెరువులు కలిపించకుండా గుర్రపు డెక్కల చెట్లు మొలిచాయన్నారు. గుర్రపు డెక్కల వల్ల వాతావరణంతో కలుషితం ఏర్పడుతోందని, వెంటనే చెరువుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదనపు కమిషనర్‌ను కలిసిన వారిలో పెరుమాళ్ల లక్ష్మణ్, పోతన వెంకటేశ్వర్లు, బత్తుల మల్లికార్జున్ ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2910	2805
పల్లికాయ (సూక)	6420	4500
పల్లికాయ (పచ్చిది)	4450	3400
కందులు	8852	6750
పెసళ్లు	8000	4552
పత్తి	7700	5500
పసుపు (కాడి)	13489	10000
పసుపు (గోల)	12424	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18000	14000
వండర్‌హాట్ ఏసీ	16000	13000
యూఎస్341 ఏసీ	14800	11000
దేశీ ఏసీ	....	....
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

ఆపద వస్తే అంతేనా?

(5వ పేజీ తరువాయి)

3గంటల వరకు ఎక్స్‌కవేటర్ యంత్రంపైనే బిక్కుబిక్కుమంటూ నిరీక్షించారు. ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన రెండు హెలికాప్టర్ల సాయంతో ఆరు గురు కూలీలను సురక్షితంగా హనుమకొండ తరలించా రు. ఇక ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ శనివారం రాత్రి వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపూర్ చెరువు అలుగులో చిక్కుని 40మందికి పైగా ఆర్టీసీ బస్సు ప్రయాణికులు 12గంటలకు పైగా ప్రాణాలను రాత్రంతా భయంభయంగా గడిపారు. మహబూబాబాద్ జిల్లాలో మానేరు వాగులో పడి యువ వ్యవసాయ శాస్త్రవేత్త అశ్వినితో పాటు ఆమె తండ్రి మోతిలాల్ మృతి చెందారు. ఇక రాళ్లవాగులో ఐదుగురు చిక్కుకపోగా రాత్రి 11.30గంటల ప్రాంతంలో నలుగురిని సురక్షి తంగా కాపాడినప్పటికి మరొకరి ఆచూకీ లేకుండా పోయింది. 2023 జూలై 27వ తేదీ వరదలకు వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాలు నీట మునిగాయి. 200కి పైగా కాలనీలల్లో ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. ఏటా వరంగల్ నగరంలో వస్తున్న వరదలకు ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతూనే ఉంది. విపత్తుల నుంచి ప్రజలకు సకాలంలో సహాయం అందటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్ వచ్చేనా?

ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్‌ను వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎస్‌డీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేసింది. అగ్నిమాపక దళంలోని చురుకైన 100మంది ఉద్యోగులను ఎంపిక చేసి శిక్షణ కూడా ఇస్తుంది. ఈ ఎస్‌డీఆర్ఎఫ్ హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తుండటంతో వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఏటా వరంగల్‌నగరంతో పాటు గోదావరితీరంలోని ములుగు, భూపాలపల్లి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లాలో ఏదో ఒక విపత్తు ఎదురవుతూ ఉంటుంది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుంది. దీనికి తోడు ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాలకు కూడా వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉండనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువగా ఈ జిల్లాల్లోనే విపత్తులు సంభవిస్తుండటంతో ప్రభుత్వం ఎన్‌డీఆర్ఎఫ్‌కు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్‌ను మామునూరు 4వ బెటాలియన్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర హోంశాఖ పరిధిలోనే ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్లు పని చేస్తున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ వరంగల్‌లో ఎన్‌డీఆర్ఎఫ్ ఏర్పాటుకు చొరవ చూపాలని ఓరుగల్లువాసులు కోరుతున్నారు.

ఉద్యోగులకు వేతనం ఇవ్వడానికి జేఏసీ నాయకులు ఎవరు?

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 10: ఉద్యోగులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మూలవేతనం కట్ చేసి సీఎం సహాయ నిధికి ఇస్తామనడానికి జేఏసీ నాయకులు ఎవరని రెవెన్యూ ఉద్యోగుల నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ప్రశ్నించారు. ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ గురించి ఏనాడు ప్రస్తావించని ఈ జాక్‌లు.. రూ.100కోట్లు ఇస్తామని ఒకరు, రూ.130 కోట్లు ఇస్తామని ఇంకొకరు ఎవరికి వారే ప్రకటించడం కిందిస్థాయి ఉద్యోగులను కించపరచడమే అన్నారు. జాక్‌లతో తమకు ఎలాంటి సంబంధం లేదని, సీఎం సహాయనిధికి తమకు చేతనంత సహాయం తమ సంఘం తరుపున చేస్తామన్నారు. అదే విధంగా భూ సమస్యలను పరిష్కరించే దిశగా గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖను బలోపేతం చేయాలన్నారు. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి అన్నివిధాలుగా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా కృషిచేస్తామన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి


తొర్రూరు అమరవీరుల స్తూపం వద్ద ఐలమ్మ చిత్రపటానికి ప్రజాసంఘాల నివాళి


కేసముద్రంలో ఐలమ్మ విగ్రహానికి నివాళుల ర్పిస్తున్న ఐలమ్మ విగ్రహ ఫౌండేషన్ బాధ్యులు


దోర్నకల్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద సీపీఎం నాయకుల నివాళి


మరిపెడలో నివాళి అర్పించిన చైర్‌పర్సన్ సింధూరకుమారి


మానుకోటలో ఐలమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 10 : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారంజిల్లాలో నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు, విగ్రహాలకు ఫ్లెక్సీలకు పూలమా లలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. అనంతరం పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని, మంజూరైన ధోబిఘాట్ పనులు వెంటనే పూర్తి చేయాలని రజక సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సింహాస్వామి, రజక సంఘం నాయకులు గోపాల్, మాచర్ల ఉప్పలయ్య, శ్రీనివాస్, పాక వెంకన్న, లక్ష్మీనారాయణ, డి.వెంకన్న పాల్గొన్నారు.

● మునిసిపల్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి చైర్మన్ రాంమోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ రవీందర్, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్ధన్, డీఈ ఉపేందర్, మేనేజర్ శ్రీధర్, టీపీవో సాయిరాం, జాటోతు రంగ్యా పాల్గొన్నారు.

● నలంద డిగ్రీ కళాశాలలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శంకర్, క్రిష్టరావు, శ్రీపాల్‌రెడ్డి, కె.ప్రసాద్, సీహెచ్.ప్రసాద్, రమేష్, గౌస్, ఉప్పలయ్య, శేఖర్, రాజు, రవి, రేణుక పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

● బయ్యారం మండలంలో రజకులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యాకయ్య, నర్సయ్య, సోములు, కట్టయ్య రవి, రమేష్, ముత్తయ్య పాల్గొన్నారు.

● తొర్రూరులోని రజక సంఘం ఆధ్వర్యంలో అమరవీరులస్థూపం వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటా నికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. నాయకులు రామలింగం, సారయ్య, మధు, మల్లేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

●మరిపెడ మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుగులోతు సింధూర కుమారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కమిషనర్ వెంకటస్వామి, వార్డు కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

●నర్సింహులపేటలో కేవీపీఎస్ నాయకులు చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు. జిల్లా సహాయ కార్యదర్శి మందుల యాకూబ్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

●పెద్దవంగరలో రజకసంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో రజకసంఘం జిల్లా నాయకులు బోనగిరి లింగమూర్తి, ఎర్రన్న, సోమయ్య, యాకయ్య పాల్గొన్నారు.

● గార్ల సీపీఐ, సీపీఎం కార్యాలయాల్లో ఆయా పార్టీల నాయకులు చాకలి ఐలమ్మ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. సీపీఎం నాయకులు కందునూరి శ్రీనివాస్, భాగం లోకేశ్వర్‌రావు, ప్రవీన్, బిక్షం, కోటయ్య, రాంబాబు, సాయి, సీపీఐ నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, పిచ్చయ్య, జనార్ధన్ పాల్గొన్నారు.

● కురవి గ్రామపంచాయతీలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరు వెంకన్న, కురవి గ్రామపంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కాంగ్రెస్ నాయకులు అవిరె మోహన్‌రావు, బాలగాని శ్రీనివాస్, ఎన్.రాజేందర్‌కుమార్, చిన్నం గణేష్, తుకారం నాయక్, మిర్యాల లక్ష్మయ్య, ధైద భద్రయ్య పాల్గొన్నారు. సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతిలో జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, నిలుగొండ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

●డోర్నకల్ మునిసిపల్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, కమిషనర్ నరేష్‌రెడ్డి, ఏఈ బాబులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు. డోర్నకల్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఉప్పనపల్లి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి దాసరి మల్లేశం, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొమ్మన అశోక్‌కుమార్, వెంకన్న, జన్ను రమేష్, బద్దెల వెంకటేశ్వర్లు, లలితమ్మ పాల్గొన్నారు.

● కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి పాఠశాలలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి హెచ్ఎం విష్ణువర్ధన్ రావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఉపాధ్యాయులు భాస్కర్, సుధాకర్, రాజ్‌కుమార్, పాషామియా, నర్సయ్య, సాంబయ్య, రాంబాబు, వసంత, జుంలాల్, శ్రీలత, మదన్‌మోహన్, పవన్ పాల్గొన్నారు. జిల్లా రజకసంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉల్లెంగుల రమేష్, ఎర్రబోతుల కవిరాజు, ఉల్లెంగుల బాల కొమురు, మురళీ, మహేష్, సతీష్, అశోక్, వెంకన్న, నాగేష్, సూరయ్య, కొమ్మాలు పాల్గొన్నారు.

● నెల్లికుదురు మండల కేంద్రంలో రజకసంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో వరిపెల్లి ఉప్పలయ్య, వెంకటేష్, పూర్ణచందర్, రత్నపురం యాకయ్య, వీరభద్రం, ఉప్పలయ్య, బీము, సాయివర్ధన్, ఆకుల నర్సయ్య, మౌనేందర్, అజ్జు, రసూల్, ఇసంపెల్లి సైదులు పాల్గొన్నారు.

● కేసముద్రంలో విలేజ్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి ఐలమ్మ విగ్రహ ఫౌండేషన్, మాజీ సర్పంచ్ సట్ల నర్సయ్య, మాజీఎంపీటీసీ సట్ల వెంకన్న పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము రాహుల్, తుంపిళ్ల వెంకన్న, కొలిపాక బాబు, పోలెపల్లి వెంకట్‌రెడ్డి, అల్లి అశోక్, కనుకుల రాంబాబు పాల్గొన్నారు.

40 వేల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం

● ఇప్పటి వరకు 9,900 ఎకరాల్లో నష్టం నిర్ధారణ
● జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 10 : జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు 40 వేల ఎకరాల వరకు వివిధ పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల తెలిపారు. వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు క్షేత్రస్థాయి పంట పొలాలను సందర్శించి వాస్తవ రిపోర్టు ప్రకారం మంగళవారం నాటి వరకు 9900 ఎకరాలు వివిధ పంటలకు నష్టం జరిగినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. మహబూబాబాద్, మరిపెడ వ్యవసాయ సహాయ సంచాలకుడి ఆధ్వర్యంలో ప్రతిరోజు క్షేత్రస్థాయికి వెళ్లి పంటనష్టంపై ప్రత్యక్షంగా చూస్తూ నష్టాన్ని నిర్ధారించి, అంచనాలు రూపొందిస్తున్నారని చెప్పారు. ఇంకా పూర్తిస్థాయి పంటనష్టం నివేదికలు రూపొందించడానికి క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటనలు చేస్తున్నారని, మంగళవారం వరకు అయినా సర్వేను ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినట్లు విజయనిర్మల తెలిపారు. పంటనష్టం సర్వేలో కూడా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న పాల్గొంటున్నారని ఆమె తెలిపారు.

బెల్లం సరఫరా చేస్తున్న నలుగురి అరెస్టు

● నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 10 : మహబూబాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా నల్లబెల్లం, పటికను సరఫరా చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ టాస్క్‌ఫోర్స్ సీఐ సీహెచ్.నీరజ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి గేట్, సాలార్‌తండా, బాబునాయక్‌తండాలలో మంగళవారం దాడులు నిర్వహించగా, నెల్లూరు నుంచి రైలుద్వారా మంగోరిగూడెం, కేసముద్రం ప్రాంతాలకు అక్రమంగా నల్లబెల్లం, పటికను సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారివద్ద ఉన్న నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటిక స్వాధీనం చేసుకుని ఇందుకు ఉపయోగించిన ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ చిరంజీవి, సిబ్బంది కిరిటి, వెంకన్న, శేఖర్, నర్సింహారావు, హచ్యా రాజు, ఇబ్రహీం పాల్గొన్నారు.

తొర్రూరు తహసీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతలు

తొర్రూరు, సెప్టెంబరు 10 : తొర్రూరు తహసీల్దార్‌గా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన వినోద్‌కుమార్ తొర్రూరు ఆర్డీవో కార్యాలయానికి ఏవోగా బదిలీపై వెళ్లగా సిద్దిపేట కలెక్టరేట్‌లో డీటీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ప్రమోషన్‌పై తొర్రూరు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను డీటీ నర్సయ్య, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి పూలమాలలతో సత్కరించి శాలువా, మెమెంటోలు అందించారు.

దంతాలపల్లి తహసీల్దార్‌గా కాటం చంద్రరాజేశ్వర్


బాధ్యతలు చేపట్టిన చంద్రరాజేశ్వర్

దంతాలపల్లి, సెప్టెంబరు10 : మండల తహసీల్దార్‌గా కాటం చంద్రరాజేశ్వర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోడిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన పదోన్నతిపై తహసీల్దార్‌గా మండలానికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీనువాస్‌రావు గతనెల 31న ఉద్యోగ విరమణ పొందారు. గిర్దావర్ నజీముద్దీన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ చంద్రరాజేశ్వర్‌కు స్వాగతం పలికారు.

చెత్త తరలింపును అడ్డుకున్న హచ్చుతండా వాసులు

● నిలిచిన తొర్రూరు మునిసిపాలిటీ వాహనాలు ● దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన


రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న తండావాసులు

తొర్రూరు, సెప్టెంబరు 10 : మునిసిపాలిటీలో చెత్తతరలింపు సమస్యగా మారింది. మంగళవారం మునిసిపల్ సిబ్బంది తరలిస్తున్న చెత్తవాహనాలను హచ్చుతండా వాసులు అడ్డుకుని, రాస్తారోకో నిర్వహించారు. తండావాసులు, సిబ్బంది తెలిపిన ప్రకారం. ప్రభుత్వం చెత్త తరలింపునకు సంగడిబోడు వద్ద పది ఎకరాల స్థలం కేటాయించి, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పక్కనే ఉన్న తండావాసులు చెత్తవాసనతో ఇబ్బందులు పడుతూ అనారోగ్యాల పాలవుతూ శ్వాసకోస వ్యాధులతో ఒకరిద్దరు మృతి చెందిన సంఘటనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో తండావాసులు మంగళవారం చెత్త తరలింపును అడ్డుకున్నారు. ఎనిమిది నెలలుగా తొర్రూరు మునిసిపల్ సిబ్బంది తొర్రూరులో రోజూ సుమారు 35 టన్నుల మేర చెత్తను శివారులో ఉన్న రోడ్లవెంట, పాడుబడిన బావుల్లో, మడిపెల్లి శివారు గ్రానైట్ గుట్ట వద్దకు తరలిస్తున్నారు. అన్ని ప్రాంతాలు నిండిపోవడంతో మంగళవారం తిరిగి సంగడిబోడుకు తరలిస్తున్న నేపథ్యంలో తండావాసులు అడ్డుకుని ధర్నా నిర్వహించారు. గతంలో ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు ఈ విషయమై ఫిర్యాదు చేయగా, తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తండావాసులు తెలిపారు. మునిసిపల్ పాలకవర్గ సభ్యులు, కమిషనర్ పట్టించుకోకుండా చెత్త తరలింపులో అలసత్వం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని, దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై తండావాసులతో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ తండా వాసులు చెత్త తరలింపును అడ్డుకున్నారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారులు స్పందించి చెత్త తరలింపునకు సరైన పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


పెద్ద సమ్మయ్య (ఫైల్)

గూడూరు, సెప్టెంబరు 10 : ఆరోగ్యం బాగోలేదని.. మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గూడూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మండలకేంద్రానికి చెందిన ఎలమందల పెద్దసమ్మయ్య (59) కులవృత్తి మంగలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మనస్తాపం చెందిన సమ్మయ్య మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రఘునమ్మ, ఇద్దరు కుమారులు రమేష్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

రూ.80 వేల నిత్యావసరాల పంపిణీ

కేసముద్రం, సెప్టెంబర్ 10 : కేసముద్రం స్టేషన్‌లో ఇటీవలె వరద ముంపునకు గురైనబాధితులకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ పంపిన బియ్యం, నిత్యావసర వస్తువులను మంగళవారం స్థానిక బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. 120 కుటుంబాలకు రూ.600చొప్పున రూ.80 వేల విలువైన సరుకులను అందజేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి తెలిపారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వోలం శ్రీనివాస్, వల్లభు వెంకటేశ్వర్లు, గాంతి వెంకట్‌రెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, కంచు సురేందర్, గడ్డం సంతోష్, జమన్‌జ్యోతి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి


గుండాల నర్సయ్య కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 10 : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు, మృతి చెందిన బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన వెంకటాపురం గ్రామానికి చెందిన గుండాల చిన్న నర్సయ్య కుటుంబానికి మంగళవారం ప్రభుత్వం ప్రకటించిన రూ.5లక్షల చెక్కును అందజేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు సోమరాజశేఖర్, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు మొగుళ్ల లింగన్న, మల్లేశంగౌడ్, పెదగాని సోమయ్య, పయ్యావుల ప్రవీణ్‌యాదవ్, హుస్సేన్, బొలగాని రమేష్ పాల్గొన్నారు. అనంతరంమండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంచు సంతోష్ తల్లి సోమక్క(70) అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్యే మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు తోట అశోక్, రావుల కిషన్‌రెడ్డి, వల్లపు మల్లయ్య, నారాయణ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను ఆదుకోవాలని వినతి

● తొర్రూరు : వర్షాలతో ముదిరాజ్‌లు నష్టపోయారని, వారిని ఆదుకోవాలని కోరుతూ తొర్రూరులో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి ముదిరాజ్ కులస్థులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభరాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ మాట్లాడారు. ముదిరాజ్ సంఘం నాయకులు చిల్లా సహదేవ్, కొత్తూరి రమేష్, అలువాల సోమయ్య, వెంకటరాములు, వెంకన్న, రాములు, వెంకన్న, కుమారస్వామి ఉన్నారు.

వరద నష్టంపై అధికారుల నివేదికలే కీలకం

మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్



రావిరాలలో నిత్యావసర సరుకులు అంజేస్తున్న మురళీనాయక్

కేసముద్రం/గూడూరు, సెప్టెంబర్ 10 : భారీ వర్షాలకు ఏర్పడిన నష్టంపై అధికారులు ఇచ్చే నివేదికలే ప్రభుత్వానికి కీలకమని, వాటి ఆధారంగానే నష్టపరిహారం మంజూరవుతుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. కేసముద్రం రైతు వేదికలో సోమవారం వర్షాలతో ఏర్పడిన నష్టంపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కోరుకొండపల్లిలో గత ఏడాది విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యర్నం వెంకటాచలం భార్య విజయకు విద్యుత్ శాఖ నుంచి రూ.5లక్షల పరిహారంచెక్కును ఎమ్మెల్యే అందజేశారు. సొసైటీ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉదయశ్రీ, ఏవో బి.వెంకన్న, కోరుకొండపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు సట్ల శ్రీనివాస్, మూల భూలోకరెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్థానిక పీడీఎస్ఎస్ సంస్థ తరఫున సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10వేల చెక్కును ఆ సంస్థ అధ్యక్షుడు బనిశెట్టి వెంకటేష్ ఎమ్మెల్యేకు అందజేశారు. అలాగే గూడూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో వీరస్వామి అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని, మాట్లాడారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలోని సమస్య లను సూపరిండెంట్ డాక్టర్ వీరన్నను అడిగి తెలుసుకున్నారు.

రోడ్లు చెరువుల మరమతులు పూర్తి చేయాలి

● నెల్లికుదురు : వరదలకు కొట్టుకపోయిన రోడ్లు, చెరువుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం రావిరాలలో విద్యాహెర్బ్ సంస్థ సహకారంతో ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్, ఎదళ్ల యాదవరెడ్డి, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

సీఎస్ఐ మాజీ ట్రెజరర్ ఎడ్విన్ రావు మృతి



డోర్నకల్, సెప్టెంబరు10 : చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) డోర్నకల్ అధ్యక్షపీఠం మాజీ కోశాధికారి (ట్రెజరర్) ముల్క ఎడ్విన్‌రావు(94) వృద్ధాప్యంతో వచ్చిన అనారోగ్యం వల్ల ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందారు. 1930 జూలై 18న డోర్నకల్‌లోని చర్చి కాంపౌండ్‌లో జన్మించిన ఎడ్విన్‌రావు డోర్నకల్ సీఎస్ఐ చర్చి నిర్మాణ ప్రదాత బిషప్ అజరయ్య వద్ద చిన్నతనంలోనే శిష్యరికం చేశాడు. తర్వాత సీఎస్ఐ సంస్థలో చేరారు. సీఎస్ఐ పరిధిలోని చర్చిలు, విద్యాసంస్థల నిర్వహణ బాధ్యతను చేపట్టి వాటిని సమర్థవంతంగా నిర్వహించాడు. 1979 నుంచి 1989 వరకు సీఎస్ఐ డోర్నకల్ ట్రెజరర్‌గా పని చేశాడు. తర్వాత చిల్డ్రన్ ఇన్ కార్పరేట్ (సీఐ) హాస్టళ్ల నిర్వహణ బాధ్యతను చేపట్టి 2003 వరకు నిర్వహించారు. కొంతకాలం కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సైతం 1990 నుంచి 1992 వరకు పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులైన మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డితో ఎడ్విన్‌రావుకు వ్యక్తిగత పరిచయాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీలో తనకున్న పరిచయాలతో 1989లో ఆయన ట్రెజరర్‌గా ఉన్న సమయంలోనే డోర్నకల్ సీఎస్ఐ చర్చి రజితోత్సవాలకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కుముద్‌బెన్‌జోషిని ఆహ్వానించారు. ఆయన ఆహ్వానం మేరకు కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎడ్విన్‌రావుకు 11 మంది సంతానం కాగా, వారిలో ఆరుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఎడ్విన్‌రావు మృతి పట్ల డోర్నకల్ మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుమీర్‌చంద్‌జైన్ సంతాపం వ్యక్తం చేశారు.

వరద బాధితులకు సాయం

బయ్యారం, సెప్టెంబరు 10 : ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు ఇళ్లు కోల్పోయి ఆర్థిక నష్టం వాటిల్లిన వరద బాధితులకు మంగళవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు సాయం అందజేశారు. మండలంలోని కొత్తపేట, సత్యనారాయణపురం, బయ్యారం, గౌరారం, కోడిపుంజుల తండాలో ఇళ్లు కోల్పోయిన 12 మంది బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులతో పాటు దుప్పట్లు, బట్టలు అందజేశారు. రూరల్ డెవలప్‌మెంట్ సోషన్ సర్వీస్(ఆర్డీఎస్ఎస్), రైతు స్వరాజ్య వేదిక (ఆర్ఎస్వీ) సహకారంతో బాధితులకు సాయం చేసినట్లు ఎన్డీ నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మధు, నాయకులు బిక్షం, నాగేశ్వరరావు, రాకేశ్, యుగందర్ పాల్గొన్నారు.

నష్టపోయిన వారిని ఆదుకోవాలి : సీపీఎం

కురవి, సెప్టెంబరు 10 : గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నిత్యావసర వస్తువులు, బియ్యం, వంట సామాగ్రి, బట్టలు తడిచి నష్టపోయిన పేదలను ఆదుకోవాలని సీపీఎం నాయకులు ఆమెడ నాగయ్య, గందసిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కురవిలో అధికారులకు వినతిపత్రం అందించారు. భారీ వర్షాలకు కురవి పెద్ద చెరువుకు పోయే రోడ్డు తెగిందని, ముత్యాలమ్మకుంట తెగి మొగిలిచర్లకు పోయే రోడ్డు తెగిపోయిందన్నారు. అనేక కాలనీల్లోని ఇండ్లలోకి నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంధసిరి జ్యోతిబసు, కట్ల కృష్ణ, నిమ్మశెట్టి మురళీ, కొలిపాక వీరేందర్, పద్మ, రాజన్న, సమ్మయ్య, గంగవ్వ పాల్గొన్నారు.

వరదబాధితులకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

నెల్లికుదురు, సెప్టెంబరు, 10 : మాజీమంత్రి హరీష్‌రావు సహకారంతో రావిరాలలో 150 మంది వరద బాధితులకు మాజీఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మంగళవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, పరిపాటి వెంకట్‌రెడ్డి, ఆకుల జగ్గయ్య, బిక్కునాయక్, విజయ్, బత్తిని అనిల్, భాను, భీముడుపులి రామచంద్రు ఆదిరెడ్డి, ఎలేందర్, బాలునాయక్, భోజ్యానాయక్ పాల్గొన్నారు.

అర్పనపల్లిని పరిశీలించిన అదనపు కలెక్టర్

కేసముద్రం, సెప్టెంబర్ 10 : ఇటీవల్లె భారీ వర్షాలకు మునిగిన మండలంలోని అర్పనపల్లి వట్టివాగు శివారు వడ్డెరకాలనీని మంగళవారం అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో పరిశీలించారు. మునిగిన ఇళ్లను నష్టం వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. నష్టం వివరాలను అధికారులకు తెలిపి నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఉదయశ్రీ, ఎంపీవో హరిప్రసాద్ ఉన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి


తేజావత్ గోప (ఫైల్)

సీరోలు, సెప్టెంబరు 10 : ప్రమాదవశాత్తు కాలువలో పడిన తేజావత్ గోప చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నగేష్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. రేకులతండాకు చెందిన తేజావత్ గోప (65) ఈనెల 8న వ్యవసాయ పొలం వద్దకు వెళుతూ ప్రమాదవశాత్తు కాలుజారి గణేష్‌కుంట అలుగుకాలువ నీటి గుంతలో పడగా అతని తమ్ముడు తేజావత్ సేత్రాం చూసి నీళ్లలోంచి బయటకు తీశాడని తెలిపారు. గోపను చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 9 రాత్రి 8 గంటలకు మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్యకాంతి, కుమారుడు వెంకన్న ఉన్నారు. కుమారుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా వెంకన్న

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 10 : ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) మహబూబాబాద్ మండల అధ్యక్షులుగా జంగిలిగొండ గ్రామానికి చెందిన కొమ్మరాజుల వెంకన్నను నియమిస్తూ మంగళవారం ఆసంఘం జిల్లా అధ్యక్షులు రాంశెట్టి వీరేందర్ తెలిపారు. వెంకన్న గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీలో చురుకుగా పనిచేస్తున్నారని చెప్పారు. ఆయన సేవలను గుర్తించి ఆయనను మండల అధ్యక్షులుగా ప్రకటించినట్లు వీరేందర్ తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి వీరేందర్‌రెడ్డిలకు వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు నూతన భవనాలు నిర్మించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ మధు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10 : శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలకు నూతన భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ కో-ఆర్డినేటర్ ఆజాద్‌చంద్రశేఖర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గుగులోతు సూర్యప్రకాష్, రాకేష్, లక్ష్మణ్, మహేష్, ప్రవీణ్, వినోద్ పాల్గొన్నారు.